క్లుప్తంగా

వైభవంగా అశ్వ వాహనసేవ



అశ్వ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అశ్వ వాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్బారెడ్డి, వెంకటరత్నం కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో ప్రముఖ అడ్వొకేట్ పీవీ రమణారెడ్డి స్మృత్యర్థంగా విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ జయంతి సభను సోమవారం రాత్రి నిర్వహించారు. సభ పోషక వ్యవస్థాపకులు పీవీ రమణారెడ్డి కుమారుడు పీవీ శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వినయ దంపతుల ఆధ్వర్యంలో రమణారెడ్డి, ఠాగూర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సినీసాహితీ విమర్శకులు పీ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై రవీంద్రుని నవలలపై మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతి ఒక్కరు జాతి,మత, ప్రాంత బేధాలను విస్మరించి విశ్వమానవులుగా ఎదగాలన్నదే ఠాగూరు ఆకాంక్ష అని పేర్కొన్నారు. అనంతరం జ్యోతిని ఘనంగా సత్కరించారు.తొలుత చేజర్ల వినయ, వినయ శిష్యబృందం రవీంద్రుని సంగీతాన్ని ఆలపించారు. అధ్యాపకుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాల్లో కమిషనర్ పాల్గొన్నారు. డయల్‌యువర్ కమిషనర్, స్పందనకు 17 విజ్ఞప్తులు రాగా పరిష్కరంచాలని సంబంధిత విభాగాధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్‌ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంపీ ఆదాలకు సన్మానం



నెల్లూరు రూరల్: గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా వీఎమ్మార్‌నగర్‌లో సోమవారం పర్యటించిన నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. ఎంపీని సత్కరించిన వారిలో సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, సీనియర్ నాయకులు లంకా రామశివారెడ్డి, జీ శ్రీధర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, తదితరులు ఉన్నారు.

నివేశన స్థలం ఇప్పించాలని వినతి

నెల్లూరు రూరల్: మైపాడుగేటు మెయిన్‌రోడ్డులో శ్రీనివాసనగర్‌లో తన పేరిట ఉన్న 17 అంకణాల ఇంటి స్థలాన్ని తన కుమారుడు వేణు, కోడలు వాణి ఆక్రమించుకుని తనపై దాడి చేసి ఇంటి నుంచి గెంటివేశారని తనకు న్యాయం చేయాలని నెట్టెం పద్మమ్మ అనే వృద్ధురాలు కోరారు. ఈ మేరకు నెల్లూరు ఆర్డీట కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ మలోలకు వినతిపత్రం అందజేసింది.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

నెల్లూరు(మినీబైపాస్):రంగనాయకులపేటలోని శాఖా గ్రంథాలయం లో గ్రంథాలయాధికారి వీ అరుణ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్ మాధవరావు పుస్తక పఠనంతో కలిగే లాభాలను చిన్నారులకు వివరించారు.

రాష్ట్రాభివృద్ధికి వైఎస్సార్‌సీపీని ఆదరించాలి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 29వ డివిజన్‌లోని వీఎమ్మార్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. రూరల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు సత్తార్, ప్రసాద్, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నాయకులు కోటేశ్వరరెడ్డి, సాయిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’పై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ప్రజలకు ఇళ్ల వద్దనే నాణ్యమైన వైద్యసేవలందేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా అమలు చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశించారు. సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నెల్లూరు డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యసిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యసేవలు అందుతున్నాయన్నారు. వృద్ధులు, గర్భిణులు, బడిపి, అంగన్‌వాడీ పిల్లలకు వైద్యసేవలు అందడం వల్ల ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. గర్భిణులకు కాన్పు జరిగే వరకు వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని కోరారు. రక్తహీనత నివారణకు మందులను సకాలంలో అందించాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దయాకర్, డాక్టర్ సతీష్‌చంద్ర, డెమో అధికారి శ్రీనివాసరావు, ఎస్ఓ సహన, తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతో గృహ నిర్మాణాల్లో పురోగతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): సచివాలయాల వారీగా పక్కాగా ప్రణాళికలు తయారు చేసుకుంటే గృహ నిర్మాణాల్లో పురోగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఎం హరినారాయణన్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో గృహ నిర్మాణాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. గృహ నిర్మాణాల్లో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రతిరోజూ సమీక్షించి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. ఖచ్చితమైన ప్రణాళిక వేసుకుని అందుకు అనుగుణంగా పనిచేస్తేనే నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోర్టు కేసులు ఉన్న లేఅవుట్లను మినహాయించి మిగిలిన వాటిలో స్టేజ్ కన్వర్షన్లు జరగాలన్నారు. ఈ వారంలో నెల్లూరు నగర పాలక సంస్థ మంచి పురోగతి సాధించిందన్నారు. ఇదే స్ఫూర్తిని జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగించాలన్నారు. గృహ రుణాల మంజూరుపై డీఆర్డీఏ, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం

జిల్లాలో మన బడి నాడు–నేడు రెండో విడత పనులను వేగవంతం చేసి స్కూళ్ల పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి నాడు–నేడు పనుల పురోగతిపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాడు–నేడు పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకుని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ రోణంకి కూర్మనాథ్, ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, డీఈఓ గంగా భవాని, హౌసింగ్ పీడీ వెంకటదాసు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, సమగ్ర శిక్ష పీఓ ఉషారాణి, ఐటీడీఏ పీఓ మందా రాణి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు అశోక్ కుమార్, రంగ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు ప్రాణదానం చేయాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిఖిల్

నెల్లూరు(మినీబైపాస్): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డకు ప్రాణదానం చేయాలని చేజర్ల మండలం నాగులవెల్లటూరుకు చెందిన లక్కాకుల చంద్రశేఖర, లక్ష్మి దంపతులు దాతలను వేడుకున్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. చంద్రశేఖర్ దంపతులకు ఇద్దరు పిల్లలు. అందులో లక్కాకుల నిఖిల్ పుట్టుకతోనే తలసేమియాతో బాధపడుతున్నాడు. వైద్యుల సలహా మేరకు గత పదేళ్లుగా ప్రతినెలా రెడ్‌క్రాస్ సహకారంతో నిఖిల్‌కు రక్తమార్పిడి చేయిస్తున్నారు. తలసేమియా వ్యాధి శాశ్వత నివారణకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.25 లక్షలు ఖర్చువుతుందని, చెన్నైలోని రేలా ఆస్పత్రిలో చికిత్స అందుబాటులో ఉందని వైద్యులు సూచించారు. దీంతో కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతలను ఆర్థిక సాయం కోసం వేడుకుంటున్నారు. దాతలు స్పందించి 63003 02274 నంబర్‌కు సాయం అందించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నెల్లూరు(క్రైమ్): భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో జాతీయరహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పలువురు చెన్నైలో వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పది మంది తమ మినీ వ్యాన్‌లో ఒడిశాకు బయలుదేరారు. భగత్‌సింగ్‌కాలనీ వద్దకు రాగానే జాతీయరహదారిపైకి అకస్మాత్తుగా ఇసుక ట్రాక్టర్ రావడంతో మినీవ్యాన్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్ బీ రత్నాకర్, క్లీనర్ జానీ తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. డ్రైవర్, క్లీనర్లు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ప్రథమచికిత్స చేయించుకుని వేరే వాహనంలో ఒడిశాకు బయలుదేరి వెళ్లారు. డ్రైవర్ రత్నాకర్ ఫిర్యాదు మేరకు నార్త్‌ట్రాఫిక్ పోలీసులు సోమవారం కేసు నమోదుచేశారు. ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఆటోడ్రైవర్ అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఊరికెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన ఆటోడ్రైవర్ అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..కొండాయపాళెంగేటు పాత మిలటరీ కాలనీలో పీ మున్నీరా, అలీఅహ్మద్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఓ పాప ఉంది. అలీఅహ్మద్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. తన అన్న పీలేరులో ఉంటున్నాడని, అక్కడి నుంచి మామిడికాయలు తెచ్చి అమ్మితే మంచి లాభాలు వస్తాయని ఆయన భార్యకు చెప్పాడు. ఈ నెల 5న పీలేరు వెళుతున్నాని చెప్పి రూ.50వేలు తీసుకుని వెళ్లాడు. అప్పట్నుంచి అతని జాడ తెలియరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. అతని ఆచూకీ కోసం గాలించినా జాడ తెలియరాలేదు. ఈ మేరకు మున్నీరా సోమవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రౌడీషీటర్ల ఘర్షణ

నెల్లూరు(క్రైమ్): ఇద్దరు రౌడీషీటర్లు ఘర్షణకు దిగి కత్తులతో దాడి చేసుకోవడంతో ఇరువురు గాయాలపాలయ్యారు. వివరాలు..తడికెలబజార్‌కు చెందిన గుణ, యనమలవారిపాళేనికి చెందిన పీ తేజపై నవాబుపేట పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. గతంలో టీపీగూడూరు పరిధిలో చోటు చేసుకున్న ఓ గొడవ విషయమై కోర్టులో వారిపై కేసు నడుస్తోంది. ఆ కేసులో రీకాల్‌పెట్టించుకునే విషయమై ఇరువురు నవాబుపేట పరిధిలోని రాఘవ స్కూల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం మాట్లాడుకుంటుండగా ఘర్షణ చెలరేగింది. అనంతరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో తేజకు తీవ్ర రక్తగాయాలవగా, బాలాజీనగర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి దాడి విషయాన్ని తెలియజేశారు. పోలీసులు ఆయన్ని హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. కాగా గుణ సైతం గాయాలతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. నవాబుపేట, బాలాజీనగర్ పోలీసులు విచారిస్తున్నారు.

బంగారు గొలుసు అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు నిలిచి ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని యువకులు అపహరించుకెళ్లిన ఘటన ఏసీనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. నజీర్‌తోట షాదీమంజిల్ ప్రాంతంలో ఏ మహాలక్ష్మి, బాబు దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం ఆమె ఏసీనగర్ చిన్నవినాయకగుడి సమీపంలో నివాసం ఉంటున్న తన అక్క ఇంటికి వెళ్లారు. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం ఇంటికి తీసుకెళ్లమని తన మనుమడికి ఫోన్‌చేసింది. మనుమడి కోసం అక్క ఇంటిముందు నిలిచి ఉండగా స్ప్లెండర్‌బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలోని ఐదు సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. ఊహించని పరిణామంతో ఖంగుతిన్న బాధితురాలు తేరుకుని పెద్దగా కేకలు వేసేసరికే దుండగులు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ నీలగిరిసంఘం విద్యుత్ ఫీడర్‌లో నూతనంగా విద్యుత్‌టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. లక్ష్మీనరసింహపురం, రామాలయంవీధి, బారాషహీద్‌దర్గా, ప్రగతినగర్, లేక్‌వ్యూకాలనీ, సుజాతమ్మకాలనీ, నెల్లూరురూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నేదురుమల్లి సంస్మరణ సభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ఇందిరాభవన్‌లో మంగళవారం సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే సంస్మరణ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు పాల్గొని నేదురుమల్లికి నివాళులర్పించాలని కోరారు.

నేడు జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఏ సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కైలాష్‌నాథ్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ, బీహెచ్‌బీ సర్వీసెస్‌లో టెలీకాలర్, ఇంగ్లీష్ న్యూస్ రీడర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెలీకాలర్స్‌కు ఇంటర్ లేదా డిగ్రీ పూర్తి చేసిన, న్యూస్ రీడర్స్‌కు ఏదైనా డిగ్రీ చదివి, ఇంగ్లీష్ చక్కగా మాట్లాడ కలిగిన నైపుణ్యం ఉన్న మహిళలు అర్హులని తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో మార్కెటింగ్, రికవరీ ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్, భారత్ ఎఫ్‌హెచ్‌లో వివిధ రకాల ఉద్యోగాలు, రేస్ డైరెక్ట్ సర్వీసెస్‌లో టెలీకాలర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.వివరాలు..ఏసీనగర్‌లో కే శ్రీనివాసులు నివాసం ఉంటున్నారు. మనస్పర్ధలతో వివాహమైన కొద్దికాలానికే భార్యతో విడిపోయారు. అప్పట్నుంచి తన సోదరి, మనుమరాలితో ఉంటున్నారు. ఈ నెల 7న శ్రీనివాసులు ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో మనుమరాలు సుందర ఉష బాలాజీనగర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు.

15 నుంచి చేతిరాతపై ఉచిత శిక్షణ

నెల్లూరు(అర్బన్) :అచర్విత ఫౌండేషన్ ఆధ్వర్యంలోఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఆరు రోజుల పాటు చేతిరాతపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీజీడీ కృపాల్ తెలిపారు. సోమవారం కర్ణాల వీధిలోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకతను సంతరించుకున్న ‘లుసిడ’ చేతిరాతపై విద్యార్థులకు ముగ్గురు మాస్టర్ ట్రెయినర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. కర్ణాలవీధిలోని సాయినాథ్ స్కూల్‌లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 98667 22532, 94913 39410, 70134 79917 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష

నెల్లూరు(మినీబైపాస్): ఏపీబీసీ అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న రాష్ట్రస్థాయిలో ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీ ప్రసాద్‌రావు, నక్కా శీనయ్యసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజుయాదవ్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు.నగరంలోని లేక్‌వ్యూ కాలనీ 2 వ వీధిలోని లిటిల్ బర్డ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 99898 50670 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



దివ్యాంగుడి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట):సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్ వాకర్స్ మెయిన్‌రోడ్డు, రఫీ డాక్టర్ వీధి, రహ్మతీయ మసీదు వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలవడమే అందుకు నిదర్శనమన్నారు. కార్పొరేటర్ స్కూళ్లకు ధీటుగా పేద, దిగువ మధ్య తరగతి పిల్లలకు కావాల్సిన అన్ని రకాల వసతులను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించడంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. గతంలో రెండు, మూడు విద్యా సంస్థలు విద్యా వ్యవస్థను కార్పొరేటీకరణ చేశాయన్నారు. అపార్ట్‌మెంట్లలో తరగతులు నిర్వహిస్తూ భారీ ఎత్తున ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉండాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకుంటే తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కేవలం రెండు విద్యా సంస్థలకు విద్యా వ్యవస్థను అప్పగించి రాష్ట్రాన్ని నాశనం చేసింది చంద్రబాబునాయుడేనని విమర్శించారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ షేక్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్(ఏపీపీహెచ్‌సీడీఏ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సరస్వతినగర్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీ అమరేంద్రనాథ్‌రెడ్డి, సురేంద్రబాబు, ఉపాధ్యక్షులుగా హరిశ్చంద్రసతీష్, స్వాతిని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శులుగా సునీల్‌కుమార్, హర్షిత, ఆర్ నవీన్, ఈ నవీన్, నిర్వహణ కార్యదర్శులుగా రమేష్‌బాబు, శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులుగా బెనడిక్ట్ ప్రమోద్, బాలచంద్రబాబు, జిల్లా కోశాధికారిగా రవిబాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాజ్యలక్ష్మి, మల్లికార్జున, శ్రీనివాసులు, రవీంద్రనాథ్‌రెడ్డి, నరసింహారావు, సయ్యద్ అహ్మద్‌బాబు, హజరత్‌రెడ్డి, రమాకుమారి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు సంతపేటలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ పెంచలయ్యను కలిశారు. డీఎంహెచ్ఓ నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

శ్రీవారి మెట్లపై భరత నాట్య ప్రదర్శన

- రేపు ‘గిన్నిస్’రికార్డు కోసం భవ్యహాసిని సాహసం



నెల్లూరు(బృందావనం): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సింహపురి చిన్నారి సాహసం చేయనుంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటుతూ తిరుమల శ్రీవారి మెట్లపై 12కిలోమీటర్లు నిర్విరామంగా భరత నాట్య ప్రదర్శన చేయనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను తల్లిదండ్రులు సోమవారం వెల్లడించారు. ఎంజీబీమాల్ వద్ద నివాసం ఉంటున్న నల్లంగు చెంచులక్ష్మి, సునీల్ కుమార్ కుమార్తె నల్లంగు భవ్యహాసిని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. కళాదీప్తి డ్యాన్స్ అకాడమీలో భరత నాట్యంలో శిక్షణపొందిన భవ్యహాసిని ఇప్పటి వరకు వందకు పైగా ప్రదర్శనలతో ప్రశంసలు అందుకుంది. గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం బుధవారం ఉదయం 10 గంటలకు తిరుమల నుంచి అలిపిరి వరకు 12 కిలోమీటర్లు నిర్విరామంగా భరత నాట్యాన్ని ప్రదర్శించనున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఇందుకోసం గత ఆరునెలలుగా నిత్యం సాధన చేస్తోందని వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన అయ్యప్పగుడి ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు..శ్రీకాకుళం జిల్లా పలాసాకు చెందిన డీ వల్లభరావు అలియాస్ నారాయణ(51)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మనస్పర్ధలతో భార్య విడిపోయి పిల్లలతో కలిసి చెన్నైలో ఉంటోంది. దీంతో వల్లభరావు కొన్నేళ్ల కిందట ఉపాధినిమిత్తం నెల్లూరుకు వచ్చాడు. అయ్యప్పగుడి సమీపంలోని హఫీజ్ టింబర్ డిపోలో పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఆయన ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. పలుమార్లు యజమాని మద్యం తాగొద్దని చెప్పినా పెడచెవిన పెట్టాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి ఆయన పూటుగా మద్యం సేవిస్తున్నాడు. సాయంత్రం అయ్యప్పగుడి ఫ్లైఓవర్‌బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులను ఆరాతీయగా టింబర్‌డిపోలో పనిచేసే వల్లభరావుగా తేలింది. మృతదేహాన్ని పోలీసులు జీజీహెచ్ మార్చురీకి తరలించి భార్యకు సమాచారం అందించారు.

రెవెన్యూ కాలనీలో మరో వ్యక్తి

రోడ్డు ప్రమాదమో.. ఎవరైనా దాడిచేసి గాయపరిచారో తెలియదు కానీ రెవెన్యూకాలనీలో మరో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు..వీఎంఆర్‌నగర్‌కు చెందిన షేక్ సుభాని(39), అబీదా దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. సుభాని పెయింట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి సుభాని తీవ్ర గాయాలతో రెవెన్యూ కాలనీ ప్రాంతంలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు భార్యకు సమాచారం అందించారు. ఆమె భర్తను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. ఈమేరకు బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.